క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలోని 11కేవీఏ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు కొట్టే కార్యక్రమం చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ ఎం. వేణుగోపాలచార్యులు తెలిపారు. నల్లగొండ పట్టణంలోని రుద్రమదేవి కాలనీ, తెలంగాణ కాలనీ, హిమగిరి కాలనీ, గోకుల్ నగర్, బ్లూ హిల్స్, ఇంద్రారెడ్డి రైస్ మిల్ ఏరియా, రూరల్ పీఎస్, ఎపీడీఓ కార్యాలయ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

సీనియర్ న్యాయవాది గణేశ్‌రెడ్డి మృతి


గణేశ్‌రెడ్డి (ఫైల్)

చిట్యాల: పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది ఏనుగు గణేశ్‌రెడ్డి (73) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. మూడు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా గురువారం చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గణేశ్‌రెడ్డి మృతి పట్ల చిట్యాల రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొబ్బల శివశంకర్‌రెడ్డి, కూనూరు సంజయ్‌దాస్‌గౌడ్, పలువురు న్యాయవాదులు సంతాపం తెలిపారు.

పదవీ విరమణ వయసు పెంచాలని వినతి


వినతి పత్రం అందజేస్తున్న అధ్యాపకులు

నల్లగొండ రూరల్: యూనివర్సిటీలో అధ్యాపకుల పదవీ విరమణ వయసు 65కు పెంచాలని కోరుతూ పలువురు అధ్యాపకులు గురువారం ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవికి వినతి పత్రం అందజేశారు. అధ్యాపకులు మాధురి, సబినా, శివరామ్, తిరుమల, సంధ్యారాణి, శ్వేత, జయంతి, కళ్యాణి పాల్గొన్నారు.

పేదలకు పండ్లు పంపిణీ

తిప్పర్తి : మాజీ జెడ్పీటీసీ తండు సైదులు గౌడ్..తన సోదరుడు తండు రామచంద్రంగౌడ్ వర్ధంతి సందర్భంగా తిప్పర్తి మండల కేంద్రంలో గురువారం సోదరుడు తండు నర్సింహ గౌడ్‌తో కలిసి పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల ఏర్పాటుపై సమీక్ష


సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ, రాజకీయ పార్టీల నాయకులు

తిప్పర్తి : గ్రామపంచాయతీ ఎన్నికల ఓటరు జాబితా, పోలింగ్ బూత్‌ల ఏర్పాటుపై వివిధ రాజకీయ పార్టీల నేతలతో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని 216 వార్డులకు గాను 216 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆల్తాఫ్ అహ్మద్, వివిధ పార్టీల నాయకులు జూకూరి రమేష్, మన్నెం భిక్షం, కందుల లక్ష్మయ్య, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న లింగయ్యయాదవ్

నకిరేకల్(శాలిగౌరారం): ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆదర్శ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కసిరబోయిన లింగయ్య కోరారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో గురువారం జరిగిన నకిరేకల్ డివిజన్ ఆదర్శ రైతు సంఘం సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేదరమెట్ల కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బట్ట భిక్షం, నకిరేకల్ డివిజన్ అధ్యక్షుడు దొంతూరి శంకర్, శాలిగౌరారం, నకిరేకల్, కట్టంగూరు, కేతేపల్లి మండలాల అధ్యక్షులు బండారి యాదగిరి, వంటిపాక భీమయ్య, గండమల్ల అంతయ్య, దుర్గం అంజయ్య పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి

చండూరు : వీధిగా వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని, లేకుంటే నిబంధనల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చండూరు మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ అన్నారు. గురువారం చండూరు మున్సిపల్ కేంద్రంలోని పలు దుకాణాలను కమిషనర్ పరిశీలించి మాట్లాడారు.

భారీగా తగ్గిన ధాన్యం కొనుగోళ్లు

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి మొగ్గు చూపని రైతులు
- మిల్లర్లకే అధికంగా అమ్మకం
- కూలి కూడా గిట్టుబాటు కావడం లేదంటున్న ఐకేపీ కేంద్రాల నిర్వాహకులు


మునుగోడు కొనుగోలు కేంద్రంలో ధాన్యం లోడు చేస్తున్న హమాలీలు

మునుగోడు: ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు అందించేందుకు అధికారులు మండల వ్యాప్తంగా ప్రతి ఏటా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అయితే గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో మునుగోడు మండలంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు భారీగా తగ్గిపోయాయి. ఈ ఏడాది ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోకుండా తక్కువ ధర వచ్చినా కూడా రైతులు నేరుగా రైస్ మిల్లుల్లో అధికంగా అమ్ముకున్నారు.

30,578 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు..

మునుగోడు మండలంలోని 27 గ్రామాల్లో రైతులు ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో దాదాపు 6600 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఐకేపీ ఆధ్వర్యంలో 5, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 5 చొప్పున మండలవ్యాప్తంగా మొత్తం 10 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఐకేపీ కేంద్రాల్లో 304 మంది రైతుల నుంచి 13,476 క్వింటాళ్లు, పీఏసీఎస్ కేంద్రాల్లో 393 మంది రైతుల నుంచి 16,832 క్వింటాళ్ల చొప్పున మొత్తం 30,578 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు.

గత యాసంగిలో 84,927 క్వింటాళ్లు..

గత యాసంగి సీజన్‌లో అధికారులు మునుగోడు మండల వ్యాప్తంగా 10 కొనుగోలు కేంద్రాల ద్వారా 84,927 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. అందులో ఐకేపీ 5 కేంద్రాల్లో 1064 మంది రైతుల నుంచి 52,083 క్వింటాళ్లు, పీఏసీఎస్ 5 కేంద్రాల్లో 719 మంది రైతుల నుంచి 32,844 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు.

కూలి కూడా గిట్టుబాటు కాని పరిస్థితి

ఈ వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు సగానికిపైగా పడిపోవడంతో కేంద్రాల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా ఐకేపీ కేంద్రాల్లో నలుగురు చొప్పున సిబ్బందిని ఏర్పాటుచేసి ధాన్యం కొనుగోలు చేస్తుండడంతో ఆ సిబ్బందికి రోజుకు కనీసం రూ.200 కూలి కూడా గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేకుండా పోయిందని వాపోతున్నారు.

షరతులు లేకుండా కొనుగోలు చేసిన మిల్లర్లు

ఈ వానాకాలం సీజన్‌లో ప్రైవేటు వ్యాపారులు గతంలో కంటే అధిక ధర చెల్లించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2221 ఉంటే వ్యాపారులు క్వింటాలుకు రూ.2000 నుంచి రూ.2100 వరకు చెల్లించి కొనుగోలు చేశారు. అది కూడా ఎలాంటి నిబంధనలు లేకుండా కోత కోసిన ధాన్యాన్ని నేరుగా మిల్లుకు తీసుకెళ్లిన వెంటనే కొనుగోలు చేశారు. దీంతో చాలామంది రైతులు రోజుల తరబడి ధాన్యం ఆరబెట్టుకుని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునే కంటే.. కోసిన వెంటనే అమ్ముకుంటే తమకు తూకం కలిసిరావడంతో పాటు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుందని భావించి మిల్లులకు అమ్ముకున్నారు. దీంతో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు భారీగా పడిపోయాయి.

కూలి కూడా గిట్టుబాటు అయ్యేలా లేదు



ఈ వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు భారీగా తగ్గిపోయాయి. గతంలో మా కేంద్రంలో కనీసం మూడు వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసేవాళ్లం. కానీ ఈ వానాకాలం సీజన్‌లో కేవలం వెయ్యి క్వింటాళ్ల వరకు కొనుగోలు చేశాం. దీంతో కేంద్రం నిర్వహణ కోసం పనిచేసిన మా నలుగురికి కనీసం రోజు కూలీ రూ.200 కూడా వచ్చేలా లేదు.

– జి.మల్లేష్, పలివెల ఐకేపీ కేంద్రం ఇన్‌చార్జ్

ఎప్పుడూ ఇంత తక్కువ కొనుగోలు చేయలేదు

మా పీఏసీఎస్ తరఫున దాదాపు పదేళ్లుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. కానీ ఈ ఏడాది అంత తక్కువ ఎప్పుడూ కొనుగోలు చేయలేదు. వరి పంట ఎంత తక్కువ సాగుచేసినా మా ఐదు పీఏసీఎస్ కేంద్రాల్లో కనీసం 50 వేల క్వింటాళ్లకు పైగా ధాన్యం కొనుగోలు చేసేవాళ్లం. కానీ ఈ ఏడాది ఐదు కేంద్రాల్లో కేవలం 16,832 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశాం.

– సుఖేందర్, పీఏసీఎస్ సీఈఓ

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా చేయాలి


తిప్పర్తి : సర్వే తీరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి


మునుగోడు: చీకటిమామిడిలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ విజయ భాస్కర్

తిప్పర్తి : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పంచాయతీ కార్యదర్శులు పకడ్బందీగా చేయాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం తిప్పర్తి మండలంలోని అంతయ్యగూడెం గ్రామపంచాయతీ పరిధి గొల్లగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 26 గ్రామపంచాయతీల్లో 8925 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

కేతేపల్లి: ఇందిరమ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు కేతేపల్లి మండలంలో సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. మండలంలోని 16 గ్రామాల్లో బుధవారం సర్వే ప్రారంభమైంది. గతంలో ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇంటి కోసం 10500 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకున్న పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. కేతేపల్లిలో సర్వే తీరును గురువారం స్థానిక ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఎంపీఓ నాగలక్ష్మి ఇందిరమ్మ కమిటీ సభ్యులు జటంగి వెంకటనర్సయ్యయాదవ్, అలుగుబెల్లి మహేందర్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

మునుగోడు: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామాల్లో అధికారులు సర్వే చేస్తున్నారు. మునుగోడు మండల వ్యాప్తంగా ఉన్న 29 గ్రామాల్లో గతంలో ప్రజా పాలన గ్రామ సభల్లో మొత్తం 12,655 మంది ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అందులో మేజర్ గ్రామ పంచాయతీ మునుగోడులోనే 1795 దరఖాస్తులు వచ్చాయి. ఆ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శులతో పాటు ప్రత్యేక సిబ్బంది సర్వే చేపడుతున్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

నకిరేకల్ : పట్టణంలోని శ్రీ షిర్డి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 15న నిర్వహించనున్న శ్రీదత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాలు, సాయి స్వాముల పూజా ప్రచార కరపత్రాలను గురువారం సాయి మందిరంలో విడుదల చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి ఉప్పల వెంకటరమణ, ప్రతినిధులు బండారు వేణుగోపాల్, తొనుపునూరి రాంబాబు, పోతుల రాములు, రామచొక్కం, సాయి స్వాములు కుర్మెల్ల శ్రీనివాస్, వంటిపాక సైదులు, మునుగోటి సైదులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ అభివృద్ధికి కృషి


పావురాలగూడెంలో అయ్యప్పస్వామి విగ్రహానికి పుష్పాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్

నార్కట్‌పల్లి : అయ్యప్ప ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండల కేంద్రంలోని హరిహరిపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో 23వ మండల పడి పూజా కార్యక్రమాన్ని బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన రమణ గురుస్వామి, స్థానిక అయ్యప్ప భక్త మండలి సభ్యుల సమక్షంలో పడి పూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు బెల్లి వెంకటేశ్వర్లు, మట్టిపల్లి యాదగిరి, గడ్డం శివరాం, పుల్లెంల శ్రీనివాస్, పరెప్రాటి సైదులు, పల్లె తిరుమల్, నాయకులు బండా సాగర్‌రెడ్డి, సట్టు సత్తయ్య, దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, దూదిమెట్ల స్రవంతి, వడ్డెగోని నర్సింహ, ప్రజ్ఞాపురం సత్తి, శంకర్ తదితరులు పాల్గొన్నారు,

గురుస్వాములకు సన్మానం

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానంలో గురువారం 18వ పడి పూర్తి చేసుకున్న నారికేలి అయ్యప్ప దీక్ష గురుస్వాములను ఘనంగా సన్మానించారు. పరైపాటి సైదులు, బెల్లి శ్రీను, బుడిదొడ్డి రాజు, దూదిగామ గోపాల్, పల్లెబోయిన రాజలింగంలను ఆలయ కమిటీ చైర్మన్ బెల్లి వెంకన్న, రమణ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి సోమయ్య, మంగురు లక్ష్మయ్య, మిట్టల్, భిక్షమయ్య, నిఖిల్ కృష్ణ, ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

దైవభక్తితో మానసిక ప్రశాంతత

నకిరేకల్ (శాలిగౌరారం): దైవభక్తితో మానసిక ప్రశాంతత కలుగుతుందని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధి పావురాలగూడెంలో బీఆర్ఎస్ నాయకుడు రాపాక రాజు నివాసంలో గురువారం జరిగిన అయ్యప్పస్వామి మహాపడిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ గోదల సురేశ్‌రెడ్డి, నిమ్మల సురేశ్, మరో పదిమంది కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు గాదరి కిశోర్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న, యూత్ అధ్యక్షుడు కల్లూరి నాగరాజు, కట్ట వెంకట్‌రెడ్డి, మామిడి సర్వయ్య, గుండా శ్రీనివాసులు, గుజిలాల్ శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని మణికంఠ ఆలయంలో మండల పూజ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. గురుస్వాములు కంపాటి శ్రీను, బచ్చు మదన్‌మోహన్, పృథ్వీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


నకిరేకల్ : వాలీబాల్ ఆడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం


నార్కట్‌పల్లి : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ నర్సింహ

నకిరేకల్ : గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. నకిరేకల్ పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మండల స్థాయి క్రీడలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత క్రీడలను ప్రోత్రహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని అన్నారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొని ప్రతిభ చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ జమురుద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, ఎంఈఓ మేకల నాగయ్య, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కోదాటి రాములు, వార్డు కౌన్సిలర్లు గాజుల సుకన్య, కందాల భిక్షంరెడ్డి, యాసారం లక్ష్మీ వెంకన్న, గడ్డం స్వామి, పీడీలు రాపోలు శైలజ, విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కట్టంగూర్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కట్టంగూర్ ఎంపీడీఓ జ్ఞాన ప్రకాష్‌రావు అన్నారు. గురువారం కట్టంగూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా కబడ్డీలో 12 మంది, వాలీబాల్‌లో 12 మంది క్రీడాకారులను జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ అంబటి అంజయ్య, చలపతి, ఫిజికల్ డైరెక్టర్లు విజయ్‌కుమార్, శ్రీనివాస్, మాణిక్యం, రాజశేఖర్ రెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

బ్రాహ్మణ వెల్లెంలలో..

నార్కట్‌పల్లి : మండలంలోని బ్రాహ్మణ వెల్లంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్–2024 క్రీడా పోటీలను గురువారం ఎంఈఓ కె.నర్సింహ ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి 120 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు నరేష్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు రామస్వామి, శ్రీనివాస్, శంభులింగం, ఇమామ్ ఖరీం, నుస్రత్ సుల్తానా, నరేందర్ తదితరులున్నారు.

చిట్యాల మండలంలో..

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం ఇటీవల నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో విజేతలకు చిట్యాల ఎంఈఓ పానుగోతు సైదానాయక్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లుఖేందర్‌రెడ్డి, పీఈటీలు బ్రహ్మయ్య, శ్రీదేవి, వెంకటరమణ, జానకి, అబ్దుల్ గఫార్, రాజు పాల్గొన్నారు.

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల కేంద్రంలో సీఎం కప్–2024 మండల స్థాయి క్రీడలను తహసీల్దార్ రాములు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ అమృతాదేవి, కార్యదర్శులు షఫీ, కారింగి శివ, ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ సిబ్బంది బానావత్ సురేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : సీఎం కప్ క్రీడా పోటీలను గురువారం మర్రిగూడ మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.చిన మునయ్య, ఎంఈఓ బి.శ్రీనివాస్, డీటీ జూటూరు తారకరామన్, హెచ్‌ఎం కళా శ్రీనివాస్, పీడీ వాసుదేవరావు, వేదవతి, నరేష్, నరసింహ, జంగయ్య, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

గణితంలో నేరడ విద్యార్థిని ప్రతిభ


విద్యార్థిని అభినయశ్రీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల: మండలంలోని నేరడ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని పి.అభినయశ్రీ ఇటీవల సదీష ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. సూర్యాపేట ఆర్‌కెఎల్‌కె బీఈడీ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఫౌండేషన్ నిర్వాహకులు మెడల్ అందజేసి అభినందించినట్లు గురువారం ఆ పాఠశాల గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు దాసరి శ్రీరాములు తెలిపారు. మూడేళ్లుగా సదీష ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో నేరడ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు జిల్లా స్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేశారన్నారు. ప్రతిభ కనబర్చిన అభినయశ్రీకి కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ విద్యను సదీష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థికి గాయం

కేతేపల్లి: గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థి కాలుకు తీవ్ర గాయం కావడంతో పాఠశాల సిబ్బంది సదరు విద్యార్థిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కేతేపల్లి మండలం బొప్పారంలో శివారులో గల మూసీ బాలుర గురుకుల పాఠశాలలో కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామానికి చెందిన నీలం యాదగిరి కుమారుడు సాయిగణేశ్ ఏడో తరగతి చదువుతున్నాడు. గురువారం సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత సాయిగణేశ్ ఆటలు ఆడి కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు సమీపంలో ఉన్న మరుగుదొడ్ల వద్దకు వెళ్లాడు. బయటకు వచ్చే క్రమంలో సాయిగణేశ్ కాలుకు గాయమై రక్తం వస్తుండటంతో తోటి విద్యార్థులు పాఠశాల సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఇరవై రోజుల క్రితం ఇదే పాఠశాలలో గణేశ్ అనే విద్యార్థి పాముకాటుకు గురికావడంతో ఆందోళన చెందిన పాఠశాల సిబ్బంది వెంటనే సాయిగణేశ్‌ను నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నల్లగొండకు తరలించారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ ధనమ్మను ఫోన్‌లో సంప్రదించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

పాము కాటుకు గురికాలేదు

విద్యార్థికి గాయమైన సమాచారం తెలిసిన వెంటనే పాఠశాల ప్రిన్సిపాల్ ధనమ్మతో ఫోన్‌లో మాట్లాడానని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. విద్యార్థి సాయిగణేశ్ పాముకాటుకు గురికాలేదని ప్రిన్సిపాల్ తెలిపిందని, స్నేహితులతో ఆడుకుంటుండగా.. ఎత్తైన దిమ్మె పైనుంచి కిందపడడంతో కాలికి గాయమైనట్లు పేర్కొన్నారు.

సౌత్ జోన్ పోటీలకు ఎన్జీ కళాశాల విద్యార్థులు

రామగిరి(నల్లగొండ) : అంతర్ కళాశాల క్రీడల్లో ఎన్జీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. గురువారం ఎంజీయూలో జరిగిన ఖో ఖో క్రీడలో మహిళా విభాగంలో జి.మౌనిక, జి.స్వాతి, పురుషుల విభాగంలో కె.మహేష్, ఆర్.లింగస్వామి, వాలీబాల్‌లో ఎస్.రాధాకృష్ణ ఉత్తమ ప్రతిభ చాటి ఎంజీయూ జట్టుకు ఎంపికయ్యారు. త్వరలో చెన్నైలో జరగనున్న సౌత్ జోన్ క్రీడా పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను గురువారం అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ ఆదె మల్లేశం, చిలుముల సుధాకర్, డాక్టర్ మునిస్వామి, డాక్టర్ భట్టు కిరీటం, డాక్టర్ అంకుష్, డాక్టర్ వెల్దండి శ్రీధర్ పాల్గొన్నారు.

'మోహన్‌బాబు బహిరంగ క్షమాపణ చెప్పాలి'

నల్లగొండ టౌన్: సినీ నటుడు మోహన్‌బాబు మీడియా ప్రతినిధులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని సీపీఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హైదరాబాదులో మీడియా ప్రతినిధులపై మోహన్‌బాబు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. మోహన్‌బాబును పోలీసులు వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నోట్‌బుక్స్, ప్లేట్లు అందజేత

నల్లగొండ రూరల్: నల్లగొండ మండలంలోని పెద్ద సూరారం, చిన్న సూరారం గ్రామాల్లో విద్యార్థులకు అగ్నిమాపక అధికారి పెండెం రామకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా గురువారం నోట్‌బుక్స్, ప్లేట్లు అందజేశారు. అదేవిధంగా నల్లగొండలో సూర్యకిరణ్ ట్రస్టులో అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు . కార్యక్రమంలో శ్రీను, సైదులు, అంజనేయులు, వెంకన్న, సందీప్, తదితరులు పాల్గొన్నారు.


నోట్‌బుక్స్, ప్లేట్లతో విద్యార్థులు

తెలుగు భాష కీలకం

నకిరేకల్ : పిల్లల మానసిక వికాసానికి తెలుగు భాష కీలక పాత్ర వహిస్తుందని ఎంఈఓ మేకల నాగయ్య అన్నారు. నకిరేకల్ మండలం నోముల జెడ్పీ హైస్కూల్‌లో గురువారం జరిగిన తెలుగు భాష ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మిర్యాల చల్మరాజు, రిసోర్స్ పర్సన్లు పాడిచేటు శంకర్, బి.వెంకటేశం, ఉపాధ్యాయులు చిన్న శ్రీనివాస్, గఫూర్, సాగర్ల సత్తయ్య, వెంకటయ్య, రవీందర్, వేణుగోపాల్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూలో చేరిక

నల్లగొండ టౌన్: మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులు గురువారం సీఐటీయూలో చేరారు ఈ సందర్భంగా వారికి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం వీరారెడ్డి మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకం కార్మికులకు అతి తక్కువ వేతనాలు ఇస్తూ వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని ఆరోపించారు. ఏడు నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూలో చేరినవారిలో బత్తుల వెంకటేశం, శివ ఉన్నారు. కార్యక్రమంలో జంజరాల శ్రీనివాస్, సైదులు, దండెంపల్లి సత్తయ్య, రవీందర్, సత్యనారాయణ, మురళి పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా సాగుతున్న క్రికెట్ పోటీలు


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న క్రీడాకారులు

నల్లగొండ : పట్టణంలోని ఎన్జీ కళాశాల మైదానంలో ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ఉత్కంఠభరితంగా జరుగుతున్నాయి. ప్రీమియర్ లీగ్ సీజన్–5 పోటీల్లో మొత్తం 64 జట్లు పాల్గొన్నాయి. ఈ నెల 20 వరకు క్రికెట్ పోటీలు జరుగనున్నాయి. గురువారం జరిగిన పోటీల్లో క్రీడాకారులు ఫోర్లు, సిక్సర్లతో ప్రేక్షకులను అలరించారు. క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, ఆర్గనైజర్స్ ప్రదీప్‌నాయక్, ఆలకుంట్ల మోహన్‌బాబు, కేసాని వేణుగోపాల్‌రెడ్డి, ముత్తినేని నాగేశ్వరరావు, బోనగిరి ప్రభాకర్, శ్రీధర్, గుండగోని సాయి, గుండగోని రాజేష్, శ్రీనివాస్, కోమటిరెడ్డి శేఖర్‌రెడ్డి, ఏర్పుల శ్రవణ్, రమేష్ పాల్గొన్నారు. అనంతరం మాలాద్రి జ్ఞాపకార్థం క్రీడాకారులకు అన్నదానం చేశారు.

పనిచేసే నాయకులకే పార్టీలో ప్రాధాన్యం


నియామక పత్రాలు అందజేస్తున్న నాయకులు

చిట్యాల: బీజేపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేసే నాయకులకు పార్టీ పదవుల్లో తగిన ప్రాధాన్యత లభిస్తుందని బీజేపీ చిట్యాల మండల అధ్యక్షుడు పొట్లపల్లి నర్సింహగౌడ్, ఎన్నికల ఇన్‌చార్జ్ పీక వెంకన్న అన్నారు. గురువారం చిట్యాల మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో బీజేపీ బూత్ కమిటీ ఎన్నికల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా 91వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా జన్నపాల రాంబాబు, 92వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా జనగాం స్వామి, 93వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా కొయ్యాటి సత్యనారాయణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కొరబోయిన లింగస్వామి, ఉయ్యాల లింగస్వామి, సాగర్ల వెంకటేశ్వర యాదవ్, పాలకూర వెంకన్నగౌడ్ పాల్గొన్నారు.

14న రౌండ్ టేబుల్ సమావేశం

నల్లగొండ టౌన్: నల్లగొండ పట్టణంలోని బోయవాడలో ఈ నెల 14న బీసీల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ రాజ్యాధికార సమితి జిల్లా ఇన్‌చార్జ్ గండి వీరేందర్‌గౌడ్ తెలిపారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్య అతిథులుగా వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు, సురేష్ హాజరవుతారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నాహకంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీసీ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించనున్నామన్నారు. సమావేశానికి బీసీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితి కన్వీనర్ కర్నాటి యాదగిరి, మార్గం సతీష్ కుమార్, లింగంపల్లి చిరంజీవి, కొడుపుగంటి శ్రీధర్, గడగోజు విజయచారి, కర్నాటి జితేందర్, చిన్నోజు రాజు, దీకొండ నవీన్ కుమార్, ఖమ్మం అఖిల్ పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

మర్రిగూడ : మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి హెచ్చరించారు. గురువారం మర్రిగూడ మండలంలో రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేసే మైనర్లను పట్టుకుని వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, ట్రిపుల్ రైడింగ్ చేయకూడదని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శంకర్ రెడ్డి, యాదయ్య, సైదులు పాల్గొన్నారు.